క్లుప్తంగా

నేడు హోం మంత్రి పర్యటన ఇలా..

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు.అనంతరం మెయిన్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశాక, కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తారు.10 గంటలకు మెరక వీధిలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తారు. ఉదయం 11.30 గంటలకు ఐ.పంగిడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు దినోత్సవంలో పాల్గొంటారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రారంభిస్తారు.అనంతరం అదే గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 12.40 గంటలకు కొవ్వూరు పట్టణ పశు వైద్యశాల వద్ద నిర్వహించే అగ్రి ల్యాబ్ భవనం ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారు.

నేడు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవం

నిడదవోలు: పట్టణంలోని నిడదవోలు–చాగల్లు ప్రధాన రహదారిపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభిస్తారు.ఈ ల్యాబ్‌ను నాబార్డు నిధులు రూ.73 లక్షల వ్యయంతో నిర్మించాలని ఏవో జి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు.

ప్రజల సమక్షంలో సమస్యల పరిష్కారం



దేవరపల్లి మండలం కురుకూరు గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- జోరుగా జగనన్న సురక్ష గ్రామ సభలు
- లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాల పంపిణీ

దేవరపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఎదుటే వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని కురుకూరు, జగన్నాథపురం, హుంకుంపేట గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను ఆయన అందజేశారు కురుకూరులో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, దేవరపల్లి మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు పాల్గొన్నారు. హుంకుంపేట, జగన్నాథపురం కార్యక్రమాల్లో గోపాలపురం మండల ప్రత్యేకాధికారి సత్యగోవింద్, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల, ఆవపాడు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. తెలికిచెర్ల కార్యక్రమంలో సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం పాల్గొన్నారు. ఆవపాడులో సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పుంత రహదారులు అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, తహసీల్దారు కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: సీహెచ్ పోతేపల్లి జగనన్న సురక్ష గ్రామ సభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని లబ్ధిదారులకు కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, తహసీల్దార్ కె.సతీష్, ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ పాల్గొన్నారు.

నిడదవోలులో 751 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

నిడదవోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పట్టణంలోని 04, 05, 06 వార్డుల ప్రజలకు స్థానిక రోటరీ ఆడిటోరియంలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు 751 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ కఠారి సిద్దార్థరాజు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: కానూరు అగ్రహారం, అజ్జరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. కానూరు అగ్రహారంలో 897, అజ్జరంలో 1078 దరఖాస్తులు రాగా వెంటనే వాటిని పరిశీలించి, ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీవో దామోదరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పెనకనమెట్ట పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.సుశీల సారథ్యంలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ప్రజల సమస్యలు ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు వారికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు,ఈవోపీఆర్ అండ్ ఆర్డీ శర్మ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని అట్లపాడులో ఎంపీడీఓ పి.శామ్యేలు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పసలపూడిలో గడప గడపకూ..



పసలపూడిలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఉండ్రాజవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పసలపూడి గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు అందించే ప్రభుత్వ పథకాలను వివరించే బ్రోచర్లను ఆయన ఇంటింటికీ అందజేశారు. ప్రభుత్వ పథకాలన్నీ అర్హులకు సక్రమంగా అందుతున్నాయా? లేదా? సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్దార్థరాజు, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్, కట్టా గోపాలకృష్ణ, అల్లూరి శ్రీనివాసు, గంటా అయ్యప్ప, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి శనివారం నుంచి ప్రతి రోజూ విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసు నడుపుతున్నట్టు నిడదవోలు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ బస్సు ఇక్కడ ఉదయం 6 గంగలకు బయలుదేరి 9.10 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి తిరిగి 9.45 గంటలకు బయలుదేరి తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోకు 12.15 గంటలకు చేరకుంటుందన్నారు. మళ్లీ తాడేపల్లిగూడెం డిపో నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి విజయవాడకు 4.10 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. విజయవాడ నుంచి సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి నిడదవోలు డిపోకు రాత్రి 8 గంటలకు చేరుకుంటుందని డిపో మేనేజర్ వివరించారు.

కాలువలో మునిగి బాలుడి మృతి



ఫణీశ్వర్ (పాత చిత్రం)

కొవ్వూరు: ఓ బాలుడు కాలువలో మునిగి మృతి చెందిన ఘటన పశివేదల గ్రామంలో విషాదాన్ని నింపింది. కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చందక ఫణీశ్వర్ (9) గురువారం సాయంత్రం ఇంటి నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. అతడి దుస్తులు గ్రామ సమీపాన ఉన్న పేముల కాలువ ఒడ్డున శుక్రవారం ఉదయం కనిపించడంతో కాలువలో వెతికినట్టు బాలుడి మేనమామ మీసాల శ్రీను తెలిపారు. ఆడుకుంటున్న క్రమంలో ఆ కాలువలోకి దిగి, నీట మునిగి ఫణీశ్వర్ మృతి చెందినట్టు నిర్ధారించుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. తల్లిదండ్రులకు ఇద్దరు కొడుకులు కాగా, ఫణీశ్వర్ తొలి సంతానం. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు ఏకధాటిగా విలపిస్తున్నారు.

టెన్త్ ఫెయిల్డ్ విద్యార్థులకు మళ్లీ అడ్మిషన్లు

నిడదవోలు రూరల్: టెన్త్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ అదే పాఠశాలలో, అదే అడ్మిషన్ నంబర్‌తో పదో తరగతి చదువుకోవచ్చని ఎంఈఓ కేఎస్‌వీ గణేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లపై సమిశ్రగూడెంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన హెచ్‌ఎంలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఒకటి గాని, అంతకంటే ఎక్కువ గాని సబ్జెక్టులు తప్పిన విద్యార్థులు వారు తప్పిన సబ్జెక్టులు తిరిగి రాసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు

చాగల్లు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ముఖ్యమని మండల విద్యాశాఖాధికారి ఎం.ఖాదర్‌బాబు అన్నారు. చాగల్లులోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల బయోమెట్రిక్ విధానంపై ఆరా తీసి పలు సలహాలు, సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో పోలవరం వాసి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలవరానికి చెందిన అక్కాబత్తుల లక్ష్మణరావు (32) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. బుల్లెట్‌పై లక్ష్మణరావు రాజమహేంద్రవరం వస్తున్నాడు. చాగల్లు మండలం నెలటూరుకు చెందిన వీర్ల లక్ష్మీనారాయణ తన మారుతీ కారులో పట్టిసీమ వెళుతున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగినప్పటికీ లక్ష్మీనారాయణ కారును ఆపకుండా వెళ్లిపోసాగాడు. రోడ్డు సేఫ్టీ మొబైల్ వాహనం వెంబడించి నిందితుడ్ని, కారును కాపవరం జంక్షన్ వద్ద పట్టుకుని కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. మృతుడి సోదరుడు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం కేసు నమోదు చేశారు. మృతుడు లక్ష్మణరావు ఎకో ఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీస్ టీమ్ లీడర్. అతడు కొరియర్ తీసుకుని రాజమహేంద్రవరం వెళుతూ మార్గమధ్యలో ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.

త్యాజంపూడి రోడ్డు నిర్మాణం చేపట్టండి

దేవరపల్లి: నిడదవోలు–యర్నగూడెం రహదారి త్యాజంపూడి నుంచి యర్నగూడెం వరకూ అధ్వానంగా ఉంది. వెంటనే దెబ్బతిన్న మేర ఈ రోడ్డును పునర్నిర్మించాలని త్యాజంపూడిలో శుక్రవారం నిర్వహించి అఖిలపక్ష సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. సుమారు మూడు కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్డు గుంటలు పడి దారుణంగా ఉన్నందున తక్షణం మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ రోడ్డు నిర్మాణానికి 2015లో నిధులు మంజూరయ్యాయి. అప్పటి ప్రభుత్వం ఆ నిధులను మరొక నియోజకవర్గానికి కేటాయించిందని, అప్పటి నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఎం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం శివార్లలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సమిశ్రగూడెం పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాడుతున్న ఐదుగురి వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.20,400 నగదు స్వాధీన పరచుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మోటార్ సైక్లిస్టును ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

దేవరపల్లి: గోపాలపురం కూడలిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ గాయపడ్డాడు. మోటార్ సైకిల్‌పై వెళుతున్న యువకుడిని నాలుగు రోడ్ల కూడలిలో జంగారెడ్డిగూడెం నుంచి ప్రయాణికులతో రాజమహేంద్రవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలైన మోటార్ సైక్లిస్ట్‌ను చికిత్స కోసం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నెలలో ఈ ప్రాంతంలో ఇప్పటికి మూడు ప్రమాదాలు జరిగాయి. ఈ మూడు ప్రమాదాలు ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ప్రమాదాలు కావడం విశేషం.

శాకంబరీదేవిగా పాలంగి కనకదుర్గమ్మ



వివిధ రకాల కూరగాయల అలంకారంలో పాలంగి కనకదుర్గమ్మ వారు

ఉండ్రాజవరం: ఆషాఢ మాసంలోని శుక్రవారాన్ని పురస్కరించుకుని పాలంగి గ్రామంలో కొలువైన కనక దుర్గమ్మ వారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సుమారు 800 కేజీల వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అర్చకుడు సాయి గౌతమ్ చక్రవర్తి ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి మహిళలు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. మండలాధ్యక్షురాలు పాలాటి యల్లారేశ్వరి, శరత్‌బాబు దంపతులు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, సూర్యారావుపాలెం, వేలివెన్ను తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎండీ షకీరాబేగం



చిలకల శారదాదేవి

నిడదవోలు: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షురాలిగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎండీ షకీరాబేగం, కార్యదర్శిగా ఆ పార్టీ కౌన్సిలర్ చిలకల శారదాదేవి, కోశాధికారిగా నీలం సరిత, ఐఎస్‌వోగా గమిని దీప్తి, ఎడిటర్‌గా కేదారిశెట్టి సునీతతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఈనెల 09వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు పీడీసీ పి.లక్ష్మీ శ్రీనివాస్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తారని ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు గుంటుపల్లి సత్యకుమారి శుక్రవారం తెలిపారు.